క్రైం కౌంటర్
webisite:www.crimecounter.in
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం
తెలుగు దిన పత్రిక
సంపుటి : 02 సంచిక : 145 ప్రకాశం, మంగళవారం 24- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-

రిపోర్టర్లు కావలెను
క్రైం కౌంటర్
తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో
- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు
కావలెను.
సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు
98497 07349



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా ....**ముళ్లపాడు గ్రామంలోని న్యూ పెట్రోల్ బంక్ వద్ద కారు ప్రమాదం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది



**క్రైమ్ కౌంటర్ న్యూస్....మార్కాపురం జిల్లా....**కొమరోలు మండలం మాధవపల్లె గ్రామ క్రాస్ రోడ్డు వద్ద బైక్ ను ఢీ కొట్టిన లారీ...బైక్ పై ఉన్న సూరే శివ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి.... కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు...

## మార్కాపురం లోని ఏపీఎస్ ఆర్టీసీ డిపో సమీపంలో రోడ్డు ప్రమాదం..



**క్రైమ్ కౌంటర్ న్యూస్....మార్కాపురం జిల్లా..**బైక్ ను బస్సు ఢీ కొన్న సంఘటనలో అమిన్ రెహమాన్(26) అనే యువకుడు మృతి. మృతుడు పుల్లలచెరువు కు చెందిన వ్యక్తి కాగా, మార్కాపురం లోని అత్త గారి ఇంటికి వచ్చి భార్య ను చూసి పోతున్న క్రమంలో రోడ్డు ప్రమాదం మృతి చెందాడు.

## సమీక్ష సమావేశము



**ఒంగోలు క్రైశీకౌంటర్ ప్రతినిధి,**ఢిల్లీలో పార్లమెంట్ హ లో గృహ , పట్టణవ్యవహారాల కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు , అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి!
## లక్ష్మీనారాయణ, బి సురేష్ బాబు డిమాండ్



**క్రైం కౌంటర్ ప్రతినిధి టి నాగ బ్రహ్మం కందుకూరు రూరల్** ,రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర సంఘం కందుకూరు నియోజకవర్గం కార్యదర్శి ఎం లక్ష్మీనారాయణ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రంను సోమవారం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో వ్యవసాయానికి 10 శాతం నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని అన్నారు. అన్నదాత సుఖీభవ నిధులను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. పకృతి విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకోవటానికి నాలుగువేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని, వడ్డీ రాయితీకి రూ2000 కోట్లు కేటాయించాలని, మైనర్ ఇరిగేషన్ కు 5000 కోట్లు కేటాయించాలని పేర్కొన్నారు. కౌలు రైతులకు ఆర్బిఐ నిబంధనల ప్రకారం రూ.2 లక్షల రూపాయలు వరకు గ్యారెంటీ లేని పంట రుణాలు ఇవ్వాలని, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఉప్పుటూరు మాధవరావు, దుర్గాప్రసాద్, బాల బ్రహ్మాచారి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సంత గాడ్గే బాబా జయంతి



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు:** ప్రముఖ సామాజిక సంఘసంస్కర్త సంత్ గాడ్గే బాబా జయంతి కార్యక్రమాన్ని పట్టణంలోని పడమటిరజక పాలెంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సి పూలమాలలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం సీనియర్ నేత కండ్లగుట్ట మోహన్ రావు,పొగాకు బోర్డు సీనియర్ రిటైర్డ్ అధికారి భీమవరపు బుచ్చయ్య రైతు సంఘం అధ్యక్షుడు చిట్యాల శ్రీనివాసులు, కొచ్చర్ల మాలకొండయ్య, కొచ్చర్ల వెంకటేశ్వర్లు తోపాటు పలువురు పాల్గొన్నారు.



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా...** గిద్దలూరు నియోజకవర్గ కంభం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మూడో వార్డు నెంబర్ శ్రీ కదం స్వర్ణలత భాయ్ ,కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

## శ్రీ సరస్వతి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు





**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** పట్టణశీ లోని శ్రీ పొట్టి శ్రీరాములు బజార్ లో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో వేంచేసియున్న శ్రీ సరస్వతి అమ్మవారి 19వ వార్షికోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు పవన్ స్వామి, అనిల్ స్వామి అమ్మవారికి పంచామృతాభిషేకం, చందనాభిషేకం, అమ్మవారి మూల మంత్ర హోమం నిర్వహించారు. నీలిశెట్టి వెంకట సుబ్బారావు దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోదండ రామాలయం ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యువ నాయకుడు అన్నా కృష్ణ చైతన్య కు జన్మదిన శుభాకాంక్షలు....

వైసీపీ మైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్,



**క్రైమ్ కౌంటర్ న్యూస్... మార్కాపురం జిల్లా...** మార్కాపురం.....జగనన్న సైనికుడు,నిత్య కృషీవలుడు,సౌమ్యుడు, ఆపదలో ఉండే వారికి ఆపద్బాంధవుడిలా!ఆదుకునే గిద్దలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే,మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ అన్నా రాంబాబు తనయుడు అన్నా కృష్ణ చైతన్య ను వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ సోమవారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు వారసత్వాన్ని,రాజకీయ చతురత,చాణిక్యతను అందిపుచ్చుకున్న అన్నా కృష్ణ చైతన్య తండ్రి లాగే నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న గొప్ప నాయకుడని కొనియాడారు..అన్నా కృష్ణ చైతన్య నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు..ఆ దేవతా మూర్తులు అందరూ ఆయనపై చల్లని దీవెనలు, ఆశీస్సులు అందించాలని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ అభిలషించారు...

## అద్భుత ఫలితాలు సాధించిన శ్రీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల








**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** ఆంధ్ర కేసరి యూనివర్సిటీ 5వ సెమిస్టర్ డిగ్రీ పరీక్షా ఫలితాలలో శ్రీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు సోమవారంఅద్భుత ఫలితాలను సాధించారు.

బి ఎస్ సి బాటనీ విభాగములో షేక్ మొహసిన్ 95% తో కాలేజీ ఫస్ట్. బిఎస్ మ్యాథమెటిక్స్ విభాగములోనేలపాటి అఖిల 92% కాలేజీ ఫస్ట్. బి సి ఏ సి ఎస్ సి విభాగములో మల్లవరపు శ్రీవాణి 96% కాలేజీ ఫస్ట్. బీకాం కంప్యూటర్ విభాగములో అరటి వేముల ఉష 89% కాలేజీ ఫస్ట్. బీకాం జనరల్ విభాగము లో పాలంకి అఖిల 88% కాలేజీ ఫస్ట్.,బి ఏ విభాగము నందు చవళం రాజేష్ 89% కాలేజీ ఫస్ట్ అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను శ్రీ గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్. రామకృష్ణారావు , విద్యాసంస్థల డైరెక్టర్ సిహెచ్.భరద్వాజ్ , శ్రీ గాయత్రీ విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి గీతా శ్రీనివాసరావు అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది అభినందనలను తెలియజేశారు.

## తాడివారి పల్లి పరిసర ప్రాంతాల్లో చిరుత సంచారం

### భయం గుప్పెట్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు



**క్రైమ్ కౌంటర్ న్యూస్... మార్కాపురం జిల్లా....** తాడివారి పల్లి చెక్ పోస్ట్, పరిసర ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తుంది. గత నాలుగు రోజుల నుంచి రహదారిపై చిరుత పులి వాహన దారుల కంట పడుతుందని, రోల్లగుంపాడు నుండి ఫారెస్ట్ చెక్ పోస్ట్ మధ్యలో, ఆశ్రమం దగ్గర చిరుత సంచారం ఉందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

పట్టించుకోని అటవీశాఖ అధికారులు

తాడి వారి పల్లి పరిసర ప్రాంతాల్లో, చుట్టుపక్కల గ్రామాల్లో చిరుత సంచారం ఉందని ఆయా గ్రామాల ప్రజలు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చిన వారు పట్టించుకోవటం లేదని, ఆధారాలు చూపించాలని ఎదురు ప్రశ్నిలు వేస్తున్నట్లు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చిరుత ఎక్కడ తమపై దాడి చేస్తుందో అని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించి, చుట్టుపక్కల గ్రామాల ప్రజల ప్రాణాలను రక్షించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించిన మార్కాపురం జిల్లా పోలీసులు

### పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ (మీ కోసం) కార్యక్రమంకు 43 ఫిర్యాదులు



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా...** ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు ఐపియస్., ఆదేశాల మేరకు మార్కాపురం డి.ఎస్.పి యు.నాగరాజు, కనిగిరి డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్ మరియు పోలీస్ అధికారులు సోమవారం మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో "మీకోసం"(గ్రా+వా) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో నలదిక్కుల నుండి వచ్చిన ఫిర్యాదులను పోలీస్ అధికారులు స్వీకరించి వారితో మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి పిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వర పరిష్కారం కల్పిస్తామని బాధితులకు భరోసా కల్పించారు.

అదేవిధంగా అందిన ఫిర్యాదుల వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు మరియు ఇతర సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. ప్రజల విశ్వాసం పెంపొందించడమే కాకుండా బాధితులకు తక్షణ సహాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని అధికారులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పొదిలి సీఐ యం.రాజేష్ కుమార్, త్రిపురాంతకం సీఐ అస్సాన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు....

## కొవ్వొత్తుల ర్యాలీ




**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,** ప్రభుత్వం వివిధ రకాలైన సర్వేలు పేరుతో వాలంటీర్ విధులను సచివాలయ ఉద్యోగులకి అప్పగించి ప్రతిరోజూ టార్గెట్లు విధించించడం వలన మానసిక వేదనకు గురై ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 70 మంది సచివాలయ ఉద్యోగులు తీవ్ర మానసిక ఆందోళనకు గురై ఆకస్మిక మరణం చెందారు. వీరి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఇలాంటి సర్వేల ఒత్తిడితో మరికొందరు మరణించకుండ ఉండేందుకు గాను స్వర్ణ వార్డ్ స్వర్ణ గ్రామ కందుకూరు డివిజన్ సచివాలయ ఉద్యోగుల జేఏసీ ఆద్వర్యంలో శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ సోమవారం జరిగింది.ఈ ఆకస్మిక మరణాల పట్ల తక్షణమే ఒక విచారణ కమీషన్ ను ఏర్పాటు చేసి నిజాలు నిగ్గు తేల్చాలి, అదేవిధంగా చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు తక్షణమే న్యాయం చేసి , వారికి తగిన ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. సచివాలయ ఉద్యోగులకు వాలంటీర్ విధులను అప్పగిస్తూ విడుదల చేసిన జి శీ ఏంఎస్ నంబరు- 11 ను వెంటనే రద్దు చేయాలి. సచివాలయ ఉద్యోగులకు కల్పించాల్సిన ప్రమోషన్స్ ను, సీనియారిటీ లిస్ట్ ను కల్పించకుండా తీవ్ర కాలయాపన చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగింది.

## ముఖ్యమంత్రి పర్యటనకు భారీ ఏర్పాట్లు...

### వెలుగొండ ప్రాజెక్ట్ వద్ద జిల్లా అధికార యంత్రాంగం...



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా....** ఈ నెల 25వ తేదీన గౌరవనీయులు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చీ. జష్ట్రుఅసతీుఎ్ఖుఎబ చీ్ఖుఱసబ వెలుగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులకు శంకుస్థాపనకు విచ్చేయనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది.వెలిగొండ ప్రాజెక్ట్ వద్ద హెలిప్యాడ్, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, వంటి ప్రతి అంశాన్ని జిల్లా అధికారులు సమగ్రంగా సమీక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మొత్తం అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తూ ఎటువంటి లోపాలు లేకుండా పర్యటన విజయవంతం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది.

ఈ క్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి శ్రీ గూడూరి ఎరిక్షన్ బాబులి ప్రతి ఏర్పాటును స్వయంగా పరిశీలిస్తూ, అధికారులు మరియు పార్టీ నాయకులతో సమన్వయం చేస్తూ ముఖ్యమంత్రి , పర్యటన విజయవంతం అయ్యేలా కృషి చేస్తున్నారు....

## అంతర పంటలతో అధిక లాభాలు.. సాగులో పాటించాల్సిన మెళకువలు

వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందాలనుకునే రైతులకు అంతర పంటల సాగు ఒక వరప్రసాదం. ముఖ్యంగా దీర్ఘకాలిక పంటల మధ్య ఖాళీగా ఉన్న స్థలాన్ని వృధా చేయకుండా, తక్కువ కాలపరిమితి కలిగిన స్వల్పకాలిక పంటలను సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం లభిస్తుంది. ఈ విధానం వల్ల భూమి ఎప్పుడూ పచ్చదనంతో నిండి ఉండటమే కాకుండా, కలుపు మొక్కల పెరుగుదల కూడా గణనీయంగా తగ్గుతుంది. తద్వారా సాగు ఖర్చు తగ్గి, రైతుకు ఆర్థికంగా భరోసా కలుగుతుంది.

పంటల ఎంపికలో పప్పు ధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం మట్టి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పప్పు జాతి రకాలను సాగు చేయడం వల్ల అవి వాతావరణంలోని నత్రజనిని గ్రహించి భూమికి అందిస్తాయి, దీనివల్ల ప్రధాన పంటతో పోషకాల కోసం ఎటువంటి పోటీ ఉండదు. పైగా ఈ మొక్కలు భూమిని సారవంతం చేసి, తదుపరి పంటలకు అవసరమైన సహజ సిద్ధమైన బలాన్ని చేకూరుస్తాయి. ఒకే రకమైన పోషకాలను గ్రహించే పంటలను కాకుండా, ఒకదానికొకటి తోడ్పడే రకాలను ఎంచుకోవడమే ఇందులోని అసలు రహస్యం. చీడపీడల నివారణ విషయంలో రైతులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రధాన పంటకు ఆశించే తెగుళ్లు అంతర పంటకు కూడా సోకే అవకాశం ఉంటే, అటువంటి రకాలను సాగు చేయకపోవడమే శ్రేయస్కరం. చీడపీడల వ్యాప్తిని అడ్డుకునే విధంగా రక్షణ పంటలను ఎంచుకోవడం వల్ల ప్రధాన పంటను తెగుళ్ల నుండి కాపాడుకోవచ్చు. పంటల మధ్య సరైన సమన్వయం ఉంటే, ఒక పంటపై వచ్చే పురుగులు మరొక పంట వాసనకో లేదా స్వభావానికో దూరంగా వెళ్లే అవకాశం ఉంటుంది.

అధిక దిగుబడి సాధించాలంటే రసాయనిక ఎరువుల కంటే సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించడం ముఖ్యం. పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్ వంటి సహజ ఎరువులు వాడటం వల్ల భూమి భౌతిక స్థితి మెరుగుపడి, పంటలు ఆరోగ్యంగా పెరుగుతాయి. పర్యావరణానికి హాని కలగకుండా, నాణ్యమైన దిగుబడిని సాధించడానికి ఈ ప్రకృతి సిద్ధమైన సాగు పద్ధతులు ఎంతగానో దోహదపడతాయి. భూసారాన్ని కాపాడుకుంటూ అంతర పంటలను సాగు చేస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.



## కల్తీపై నేడు అసెంబ్లీలో చర్చ ఉ.10.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు

**క్రైమ్ కౌంటర్ న్యూస్** అమరావతి, ఫిబ్రవరి 23 తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై మంగళవారం శాసనసభలో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం అసెంబ్లీలోని తన చాంబరులో మంత్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కల్తీ నెయ్యిపై ఎప్పుడు చర్చిద్దామని వారు అడుగగా.. మంగళవారమే పెడదామని ఆయన సూచించారు. ప్రశ్నోత్తరాల అనంతరం జీరో అవర్ రద్దు చేసి ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కల్తీ నెయ్యిపై చర్చించాలని నిశ్చయించారు. టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలు ఇందులో పాలుపంచుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సీఎం మాట్లాడతారు. స్వర్ణదేవాలయం నిబంధనలను పరిశీలించాలి.. మంత్రులతో చంద్రబాబు చర్చ సందర్భంగా పలు అంశాలు తెరపైకి వచ్చాయి. తిరుమలలో నిబంధనలను మరింత కఠినతరం చేయాలని, పంజాబ్ అమృతసర్‌లోని స్వర్ణ దేవాలయంలో నిబంధనలు కఠినంగా ఉంటాయని.. తిరుమలలోనూ ఆ తరహావి అమలు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. కాగా.. కల్తీ నెయ్యి అంశంపై సీబీఐ సిట్ నివేదిక అమలు కోసం రాష్ట్రప్రభుత్వం ఏకసభ్య కమిటీ వేయడాన్ని సవాల్ చేస్తూ సుబ్రమణ్యంస్వామి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై చంద్రబాబు స్పందించారు. అది ఆయన వేసిన పిటిషన్ కాదని, వైసీపీ వేయించిన పిటిషన్ అని, ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.శాసనమండలి బీఏసీ సమావేశం వాడివేడిగా సాగింది. సోమవారం చైర్మన్ మోషేన్ రాజు చాంబరులో జరిగిన భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ నడుమ వాడీవేడి చర్చ జరిగింది. బొత్స మాట్లాడుతూ.. మీరు బీఏసీలో ఒకటి చెప్పి, సభలో ఇంకొకటి చెబుతున్నారని అధికారపక్షాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పయ్యావుల స్పందిస్తూ.. ఎక్కడైనా ఒకటే చెబుతున్నామని, సభలో గానీ, బయట గానీ కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధమని చెప్పారు. అసెంబ్లీలో, మండలిలో కల్తీనెయ్యిపై చర్చ పెడతామని మొదటి రోజే కోరామని.. చర్చ జరగకుండా మీరే నాలుగురోజులు సభ సమయాన్ని వృథా చేశారని వ్యాఖ్యానించారు. దరిమిలా.. కల్తీనెయ్యిపై 26న మండలిలో చర్చించాలని బీఏసీలో నిర్ణయించారు. బడ్జెట్‌పై మండలిలో చర్చ పెట్టాలని బొత్స కోరగా, ఇప్పటికే చర్చ పూర్తయిందని కేశవ్ సమాధానమిచ్చారు. శాసన సభలో ఇప్పటికే బడ్జెట్‌పై చర్చ పూర్తయిందని, ఇకపై ఆ అంశంపై చర్చ ఉండదని స్పష్టం చేశారు. మంగళవారం హోం శాఖపై, 25న వ్యవసాయ శాఖపై చర్చించాలని నిర్ణయించారు. 28న శనివారం మండలికి సెలవు ప్రకటించారు.

# సంక్షేమానికి బడ్జెట్ పెంచాం

**ఆర్థిక అసమానతలు తగ్గిస్తాం**
**అన్ని వర్గాలకూ న్యాయం చేస్తాం**
**సామాజిక సమానత్వం తెస్తాం**
**బీసీల రిజర్వేషన్ల పెంపునకు కసరత్తు.. అసెంబ్లీలో సీఎం**



**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, ఫిబ్రవరి 23రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, అల్పాదాయ వర్గాలవారికి ఆదాయ మార్గాలు కల్పించడం ద్వారా మెరుగైన జీవన ప్రమాణాలు పెంచేందుకు కసరత్తు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సాంఘిక సంక్షేమం, మహిళ, శిశు, గిరిజన సంక్షేమం, వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, మైనారిటీ సంక్షేమ శాఖలకు బడ్జెట్ కేటాయింపుల కోసం సంబంధిత శాఖల మంత్రులు ప్రతిపాదించిన డిమాండ్లపై సోమవారం శాసనసభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, అన్ని వర్గాలవారికీ న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. "రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసి సంక్షేమం, అభివృద్ధి కోసం ఆదాయం పెంచుతామని ప్రజలకు హామీ ఇచ్చాం. ఆ దిశగానే ముందుకు వెళుతున్నాం. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి, ఆయా వర్గాల జనాభా దామాషా ప్రకారం రాజకీయంగా అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక సమానత్వం కోసం కృషి చేస్తున్నాం. ఎన్నికల్లో కూటమికి 94 శాతం విన్నింగ్ చాన్స్ ఇచ్చారంటే ప్రజలు మనపై ఎంత నమ్మకం పెట్టుకున్నారో చూడండి. వారి నమ్మకాన్ని మనం నిలబెట్టుకోవాలి. 'సూపర్-6' హామీలను సూపర్ హిట్ చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుంది. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమానికి వీలైనంత వరకు బడ్జెట్ కేటాయింపులు పెంచాం. వాటిని ఆయా వర్గాలకే ఖర్చు చేసేలా చిత్తశుద్ధితో పని చేస్తాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ, వారికి సంక్షేమ కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాం. 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌లో నిర్దేశించుకున్న ప్రకారం ప్రజల తలసరి ఆదాయాన్ని రూ. మూడు లక్షల నుంచి రూ. 54 లక్షలకు పెంచే నిర్దిష్ట లక్ష్యాలతో ముందుకు సాగుతున్నాం.

భావితరాలపై ప్రధానంగా దృష్టి సారించి, అంగన్‌వాడీ కేంద్రాలు మొదలుకొని రెసిడెన్షియల్ స్కూళ్లు, కాలేజీలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నాం. పీపీపీ విధానంలో రోడ్లు, విమానాశ్రయాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనతో సంపద పెరిగినప్పటికీ, సమాజంలో అసమానతలు మాత్రం తగ్గలేదు. వీటిని తగ్గించేందుకే పీ4 విధానం తీసుకువచ్చాం. రాష్ట్రంలో ఇప్పటివరకు 10 లక్షల బంగారు కుటుంబాలను ఒక లక్ష మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారు. సమాజంలో అసమానతలు తగ్గించడానికి పీ4 కు మించి కార్యక్రమం లేదు. దీనిని నిరంతరం పర్యవేక్షిస్తాం. ప్రభుత్వ విధానాలతోనే ఆర్థిక అసమానతలు తొలగిపోతాయి. బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు క్యాబినెట్ సబ్ కమిటీని నియమించి కసరత్తు చేస్తున్నాం. బీసీ రక్షణ చట్టాన్ని అమలులోకి తీసుకువస్తాం. బీసీల్లో కొన్ని కులాలవారు తమను ఎస్సీ, ఎస్టీల జాబితాల్లో చేర్చమని కోరుతున్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎస్సీ ఉప కులాలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలుచేసి సామాజిక న్యాయం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే"నని చంద్రబాబు తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం గతంలో అమలు చేసిన జీవో 3ను నిలిపివేశారని, మళ్లీ ఆ జీవోను తిరిగి తీసుకువచ్చే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. "మైనారిటీ వర్గాల రక్షణతో పాటు అనేక విధాలుగా వారిని ఆదుకుంటున్నాం. ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాలు చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వం మాదే. మరోవైపు మహిళా కేంద్రంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. ఆడబిడ్డలను అన్ని విధాలుగా ఆదుకోవడానికే డ్వాక్రా సంఘాలు పెట్టాం. త్వరలోనే కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులు తీసుకువచ్చి ప్రతి వ్యక్తికీ రక్షణ కల్పిస్తాం.' అని చంద్రబాబు తెలిపారు.

ఎక్కువ మంది పిల్లలున్నా ఎన్నికల్లో పోటీ చేయొచ్చు నీటి యాజమాన్య సంఘాల చట్ట సవరణ

అసెంబ్లీలో నీటి యాజమాన్య సంఘాల సవరణ చట్టాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సభలో ప్రవేశపెట్టడంతో శాసనసభ ఆమోదించింది. స్థానిక సంస్థల్లో మాదిరిగానే నీటి యాజమాన్య సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలంటే.. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉండరాదన్న నిబంధన ప్రస్తుతం అమల్లో ఉంది. ఇప్పుడు దేశంలో పరిస్థితి మారడంతో.. ఎంతమంది పిల్లల్ని కనాలన్న దానిపై నియంత్రణ అవసరం లేదన్న ఉద్దేశంతో పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు చట్టాలను సవరణ చేశారు. అదేవిధంగా నీటి యాజమాన్య సంఘ ఎన్నికల్లో ఈ నిబంధన ఎత్తేయాలని ప్రభుత్వం భావించింది. సోమవారం అసెంబ్లీలో ఏపీ ఫార్మర్స్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్(సవరణ)బిల్లు-2026ను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఏఐతో పిల్లలు నిరుద్యోగులవుతున్నారు: ఎమ్మెల్యే అరవింద్‌బాబు

ఏఐ, క్వాంటమ్ కారణంగా 90 శాతం పిల్లలు ఉద్యోగాలు కోల్పోతున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో నిరుద్యోగం పెరిగిపోతోంది. ప్రభుత్వాలు వారికి అండగా నిలబడాలి. 22ఏ నుంచి తొలగించాలి: ఆరణి వైసీపీ హయాంలో తిరుపతిలో 15 వేల ఇళ్లను 22ఏలో పెట్టారు. కరుణాకర్‌రెడ్డి తనకు వ్యతిరేక పార్టీ వారికి సంబంధించి ఇళ్లన్నింటినీ 22ఏలో పెట్టించారు. దీంతో వాటికి పన్నులు వసూలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఈ ఇళ్లను 22ఏ నుంచి తొలగించి, పేదలను ఆదుకోవాలి.

# ఉగాదికి మెగా 'జాబ్ క్యాలెండర్'

## గత రెండేళ్లలో కేజీబీవీల ఫలితాలు మెరుగు

**ఇప్పుడు అడ్మిషన్లకు పోటీ**
**ఉత్తరాంధ్రలో పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన ఎకోసిస్టమ్ ఏర్పాటు చేస్తున్నాం**
**అసెంబ్లీలో లోకేశ్ వెల్లడి**



**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, ఫిబ్రవరి 23 ఉగాది నాటికి 'మెగా జాబ్ క్యాలెండర్' ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని విద్యాశాఖ మంత్రి లోకేశ్ వెల్లడించారు. సోమవారం అసెంబ్లీలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. జాబ్ క్యాలెండర్‌లోనే టీచర్ పోస్టులు కూడా ఉంటాయని తెలిపారు. గతేడాది మెగా డీఎస్సీలో భాగంగా ఇప్పటికే 16 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేశామని పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్ర కేజీబీవీల్లో దేశంలో ఎక్కడా లేనివిధంగా అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఇక్కడ చేరేందుకు విద్యార్థినులు పోటీపడుతున్నారని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో గత రెండేళ్లల్లో ఫలితాలు బాగా మెరుగుపర్చామన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమని, కేంద్రం 60 శాతం నిధులు ఇస్తే, రాష్ట్రం 40 రాష్ట్రం నిధులు కేటాయిస్తుందన్నారు. కేజీబీవీల్లో విధులు నిర్వహించే ప్రిన్సిపాళు ,, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి జీతాలు పెంచాలన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్ణయం తీసుకోవాలని, కేంద్రం అందించే బడ్జెట్ పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ విషయమై కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నామని, దానికి కేంద్ర మంతి ధర్మేంధ్ర ప్రధాన్ స్పందించారని తెలిపారు. ఎన్‌టీఎ?సకు కేంద్రం ఒప్పుకోవాల్సి ఉందన్నారు. దాదాపు 11 వేల మంది ఈ వ్యవస్థలో పనిచేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం ఆంగీకరించిన తర్వాతనే జీతాలు పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. హైకోర్టులో పిటిషన్ ఉందని, దానిపై కూడా సమీక్ష చేస్తామన్నారు. కేంద్రం పీఏబీ ఆమోదించిన తర్వాతనే జీతాలు పెంపును తాము బాధ్యతగా తీసుకుంటామన్నారు.ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఎక్కువ మొత్తంలో జీతాలు మన రాష్ట్రంలోనే చెల్లిస్తున్నామని, అయినా తాను కేంద్ర మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ కలిసినప్పుడు కూడా బడ్జెట్ పెంచాలని కోరానని గుర్తుచేశారు. తొలుత ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేజీబీవీల్లో ప్రిన్సిపాళ్లను కాంట్రాక్ట్ పద్ధతిన నియమించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అక్కడ విధులు నిర్వహించే సిబ్బందికి ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. కాగా, రాష్ట్రంలో వచ్చే ఏడాది సాస్కీ పథకం కింద విజయనగరం పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక సదుపాయాలు, అదనపు భవనాల నిర్మాణానికి చర్యలు చేపడతామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో ఇంజనీరింగ్‌తో పాటు పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ విద్య కూడా అంతే కీలకమన్నారు.5 శాఖల పద్దులకు ఆమోదం

ఐదు ప్రభుత్వ శాఖలకు బడ్జెట్ కేటాయింపులకోసం మంత్రులు ప్రతిపాదించిన డిమాండ్లను శాసనసభ ఆమోదించింది. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమం,మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖలు,వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ, పౌరసరఫరాల శాఖలకు నిధుల కోసం ప్రతిపాదించిన డిమాండ్లపై జరిగిన చర్చలో ఎమ్మెల్యేలు వర్ల రాజా (పామర్రు), సత్యనారాయణ (పి.గన్నవరం), రామాంజనేయులు (ప్రత్తిపాడు), సత్యప్రభ (ప్రత్తిపాడు,), ప్రశాంతిరెడ్డి (కొవూరు), సౌమ్య (నందిగామ), బాలరాజు (పోలవరం), జగదీశ్వరి (కురుపాం), సోమిరెడ్డి (సర్వేపల్లి), అశోక్ (ఇచ్ఛాపురం), మాధవి (గుంటూరు పశ్చిమ), డి.పార్థసారథి (ఆదోని), మహ్మద్ నజీర్ (గుంటూరు తూర్పు), విష్ణుకుమార్‌రాజు (విశాఖ నార్త్)లు మాట్లాడారు.

# రెవెన్యూ'కు ఫ్రెష్ లుక్!

**ఆ శాఖను దారిలోకి తీసుకురావాలి**
**భూముల రీసర్వేతో అన్ని సమస్యలూ పోవాలే తప్ప.. కొత్త వివాదాలు రాకూడదు**
**ఏసీబీ దాడులు చేసే పరిస్థితి ఉండొద్దు**
**పనిచేయని తహసీల్దార్లను పక్కనపెట్టండి**
**ప్రభుత్వ సేవలపై ప్రజల్లో మరింత అవగాహనకు ప్రత్యేక కార్యాచరణ**
**ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత కనిపించకూడదు**
**ఆలయాల్లో సదుపాయాలు మెరుగుపడాలి**
**పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజీ**
**వివిధ శాఖలపై సమీక్షలో సీఎం చంద్రబాబు**



అమరావతి, ఫిబ్రవరి 23

రెవెన్యూను దారిలోకి తీసుకొచ్చి.. ఆ శాఖకు ఫ్రెష్ లుక్ తీసుకురావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు రెవెన్యూ శాఖ అవినీతి రహితంగా ఉండాలని పేర్కొన్నారు. భూముల రీ సర్వేతో అన్ని సమస్యలూ పోవాలే తప్ప.. కొత్త వివాదాలు రాకూడదని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు సోమవారం అమరావతి సచివాలయంలోని ఆర్టీజీఎస్ కార్యాలయం నుంచి వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించారు. రెవెన్యూ శాఖ ఉద్యోగులపై ఏసీబీ దాడులు చేసే పరిస్థితి రాకుండా చూసుకోవాలన్నారు. సరిగా పనిచేయని తహశీల్దార్లను పక్కన పెట్టాలని, బాగా పనిచేసే డిప్యూటీ తహసీల్దార్లను గుర్తించి వారికి తహసీల్దార్లుగా పదోన్నతులు ఇవ్వాలన్నారు. సర్వేయర్లు సరిగా వ్యవహరించకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై ఆడిట్ చేయించాలని సూచించారు.

ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యానికి వారిదే బాధ్యత

ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత లేకుండా చూడాలని వైద్యారోగ్య శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు తరచూ కలెక్టర్లతో వైద్యుల ఖాళీల వివరాలు తెలుసుకొని భర్తీ చేయాలన్నారు. ఆస్పత్రులు బాగుపడాలని, దేవాలయాల్లో సదుపాయాలు మెరుగుపడాలని సూచించారు. ఆస్పత్రుల్లో పారిశుధ్యం పాటించకుంటే.. సంబంధిత అవుట్ సోర్సింగ్ ఏజెన్సీని బాధ్యులను చేయాలన్నారు. గతంతో పోలిస్తే ఆలయాల్లో సౌకర్యాలు బాగా మెరుగయ్యాయని.. మరింత పెంచాలని సూచించారు. తాగునీటి శాంపిళ్ల పరీక్షలకు మొబైల్ ల్యాబ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

అభినందన లేఖలు ఇవ్వండి

ఉద్యోగుల పనితీరును మదింపు చేస్తున్నందున.. పనితీరు బాగా లేని వారిని మోటివేట్ చేయడంతో పాటు బాగా పనిచేస్తున్న వారిని ప్రశంసించాలని సూచించారు. ఇలా చేయడం వల్ల ఉద్యోగుల్లో పనిచేశామన్న సంతృప్తి, ఉత్సాహం వస్తాయన్నారు. ఈ విధానం బాగుంటుందని, ఉద్యోగులను ఇలా అభినందించడం ఇదే తొలిసారి అవతుందని పలువురు ఆధికారులు అన్నారు. ఈ రకమైన విధానంతో ఉద్యోగుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. నెలవారీగా బాగా పని చేస్తున్న ఉద్యోగులకు అభినందన లేఖలు అందించాలని సీఎం సూచించారు. వ్యక్తిగత రికార్డుల్లోనూ నమోదు చేయాలని స్పష్టం చేశారు.

ఒప్పందాలను విజయవంతంగా అమలు చేయాలి

ప్రభుత్వం పెద్దఎత్తున టెక్నాలజీ సాయంతో సేవలు అందిస్తోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. పరిపాలనలోనూ సాంకేతికతను అందిపుచ్చుకున్నామని చెప్పారు. టెక్నాలజీ సాయంతో అందిస్తున్న సేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ సేవలను టెక్నాలజీ సాయంతో మరింత సులభతరం చేయాలని ఆదేశించారు. ఇటీవల ఢిల్లీలో ఏఐ-ఇంపాక్ట్ సదస్సుకు హాజరయ్యామని, అక్కడ ప్రదర్శించిన టెక్నాలజీలను అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఏడు ఒప్పందాలను మున్సిపల్, వైద్యం, వాణిజ్య పన్నులు, ఐటీ, పరిశ్రమల శాఖలు విజయవంతంగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు.

# ప్రారంభోత్సవం కోసం టీసీఎస్ ఎదురుచూపు



విశాఖపట్నం, ఫిబ్రవరి 23 విశాఖపట్నంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) కార్యాలయం ప్రభుత్వ పెద్దల చేతుల మీదుగా ప్రారంభోత్సవం కోసం ఎదురుచూస్తోంది. ఇది లాంఛనం మాత్రమే. ఇప్పటికే 200 మంది వరకు ఉద్యోగులు వారి ప్రాజెక్టు పనులపై రోజూ ఆఫీసుకు హాజరవుతున్నారు. రుషికొండ ఐటీ పార్కులోని హిల్-3పై మిలీనియం టవర్ల (1, 2)లో సుమారుగా పది అంతస్థులు టీసీఎస్‌కు కేటాయించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి ఉద్యోగులను ఇక్కడకు పంపుతున్నారు. విశాఖలో ఉంటూ 'వర్క్ ఫ్రమ్ హోమ్' చేస్తున్న వారు సమావేశాల కోసం ఇక్కడికి వస్తున్నారు. విశాఖ క్యాంపస్ కోసం కొద్దిరోజుల క్రితం ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. టీసీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఇక్కడే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు సమయం ఇస్తే.. ముహూర్తం పెట్టుకొని ఆ రోజున లాంఛనంగా ప్రారంభోత్సవం చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. అదేవిధంగా హిల్-3పై శాశ్వత క్యాంపస్ నిర్మాణం కోసం 21.16 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అక్కడ శంకుస్థాపన కూడా చేయాల్సి ఉంది.

# సినిమా



## ఒకప్పుడు టాలీవుడ్ సెన్సేషనల్ హీరో..

ఒకప్పుడు తెలుగులో క్రేజీ హీరో. 90'ం అమ్మాయిల కలల రాకుమారుడు. అప్పట్లో వరుసగా ఒక్కో సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరో ఒకప్పుడు ఇండస్ట్రీలో తోపు హీరో. స్టార్ నటుడి వారసుడిగా సినీరంగంలోకి అడుగుపెట్టాడు. చిన్న వయసులోనే స్టార్ డమ్ సంపాదించుకున్నారు. కెరీర్ ప్రారంభించిన తొలి నాళ్లల్లోనే ప్రేమకథ చిత్రాలు, రొమాంటిక్ సినిమాలతో యువతలో మంచి క్రేజ్ సొంతం చేసుకున్నాడు. అంతేకాదు.. 17 ఏళ్ల వయసులోనే దర్శక దిగ్గజాలు మణిరత్నం, శంకర్ వంటి దర్శకుల సినిమాల్లో హీరోగా నటించారు. అయితే కెరీర్ మంచి ఫాంలో ఉండగానే సినిమాలకు దూరమైన ఆయన.. ఆ తర్వాత కొన్నాళ్లకు రీఎంట్రీ ఇచ్చారు. ఒకప్పుడు హీరోగా మెప్పించిన ఆయన.. ఇప్పుడు సహాయ నటుడిగా దూసుకుపోతున్నారు. అయితే హీరోగా సత్తా చాటుతున్న సమయంలోనే పర్సనల్ విషయాలతో మానసిక ఒత్తిడికి గురయ్యారు. భార్యతో విడాకులు తీసుకోవడంతో మానసిక సంఘర్షణకు గురై.. చాలా రోజులపాటు ఇండస్ట్రీకి దూరంగా ఆయన.. ఇప్పుడు బిజినెస్ రంగంలో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద జ్యూయెలరీ మాల్ ఓనర్ గా ఉన్నాడు. అతడు మరెవరో కాదు.. హీరో ప్రశాంత్. జీన్స్ సినిమాతో తమిళం, తెలుగులో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నాడు. ఆ తర్వాత ఎన్నో హిట్ చిత్రాలతో తనదైన ముద్ర వేశాడు. ఇప్పుడు సహయ నటుడిగా రాణిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం చెన్నైలోని పానగల్ పార్క్ లో ఆయన రియాల్ గోల్డ్ టవర్ పేరుతో ఓ విశాలమైన జ్యూయెలరీ మాల్ కట్టించారు. దాదాపు 10 అంతస్తులతో సుమారు రూ.1.7 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆ బిల్డింగ్ నిర్మించారు. ఇందులో దేశంలోని బ్రాండెడ్ నగలు ఉన్నాయి. అలాగే అందులో ఫుడ్ కోర్ట్స్, ఏటీఎమ్స్ సైతం ఉండడం గమనార్హం. రామ్ చరణ్ నటించిన వినయ విధేయ రామ సినిమాలో హీరో సోదరుడిగా కనిపించారు. ప్రస్తుతం చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్నాడు.





## బాడీని సర్ఫ్ వేసి కడిగినట్లే.

ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి డిటాక్స్ పానీయాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అటువంటి వాటిలో దాల్చినచెక్క, తేనె డిటాక్స్ డ్రింక్ ఒకటి.. దీనిని దాల్చిన చెక్క పొడి, తేనె, నిమ్మకాయ రసంతో సులభంగా తయారుచేసుకోవచ్చు. ఈ ఆరోగ్యకరమైన పానీయం శరీరంలోని విషపదార్థాలను తొలగించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ మిశ్రమంలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. దాల్చినచెక్క-తేనె డిటాక్స్ డ్రింక్.. యాంటీఆక్సిడెంట్లు (పాలిఫెనాల్స్), సిన్నమాల్డిహైడ్ (దాల్చినచెక్కలో), ఫినోలిక్ సమ్మేళనాల (తేనెలో) గొప్ప మూలం.. ఇది జీవక్రియను మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడం, వాపును తగ్గించడం, బరువు తగ్గడంలో సహాయపడుతుందని పేర్కొంటున్నారు. దాల్చిన చెక్క తేనె డిటాక్స్ డ్రింక్‌కు కావలసిన పదార్థాలు:

దాల్చిన చెక్క పొడి, తేనె, నిమ్మకాయ, నీరు..

తయారీ విధానం:

సిన్నమన్ హనీ డిటాక్స్ తయారుచేయడం చాలా సులభం. ముందుగా, ఒక పాత్రలో తగినంత నీటిని తీసుకుని పొయ్యి మీద పెట్టి బాగా మరిగించాలి. నీరు మరిగిన తర్వాత, దానికి తగినంత దాల్చిన చెక్క పొడిని కలపాలి. నీటి పరిమాణం, దాల్చిన చెక్క ఘాటును బట్టి పొడిని సర్దుబాటు చేసుకోవాలి. దాల్చిన చెక్క పొడి వేసిన తర్వాత మరికొద్దిసేపు మరిగించాలి. అప్పుడే దాల్చిన చెక్కలోని పోషకాలు నీటిలో కలుస్తాయి. ఆ తర్వాత ఈ ద్రావణాన్ని ఒక గ్లాసులోకి వడకట్టుకోవాలి. చివరగా, దానికి కొద్దిగా నిమ్మకాయ రసం, ఒక స్పూన్ తేనెను కలిపి బాగా కలుపుకుంటే వేడివేడి సిన్నమన్ హనీ డిటాక్స్ సిద్ధం అవుతుంది. నిమ్మకాయ, తేనె దాల్చిన చెక్క ఘాటైన రుచిని సమతుల్యం చేస్తాయి.

ఎన్నో పోషకాలు.. మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు:

దాల్చిన చెక్క, తేనె, నిమ్మకాయల కలయిక అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. దాల్చిన చెక్కలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడి ఆరోగ్యాన్ని కాపాడతాయి. ఈ డిటాక్స్ పానీయం శరీరంలోని టాక్సిన్స్‌ను సమర్థవంతంగా తొలగిస్తుంది.. తద్వారా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అలాగే, ఇది రోగనిరోధక శక్తిని కూడా బలోపేతం చేస్తుంది.. శరీరాన్ని వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడుతుంది.

ఎప్పుడు తీసుకోవాలి?

ఈ డిటాక్స్ పానీయాన్ని ఉదయం పూట తీసుకోవడం ఉత్తమం. చాలా మంది ఉదయం టీ లేదా గ్రీన్ టీ తీసుకుంటారు. దాని స్థానంలో ఈ సిన్నమన్ హనీ డిటాక్స్ ను తీసుకోవచ్చు. డిటాక్స్ డైట్‌లో ఉన్నప్పుడు, రోజులో అనేక రకాల డిటాక్స్ టీలను ప్రతి రెండు లేదా మూడు గంటలకు ఒకసారి తీసుకోవాల్సి ఉంటుంది.. అందులో ఇది ఒక రకం. డిటాక్స్ సమయంలో పాలు కలిపిన టీలను నివారించాలి. కాబట్టి పాల బదులు నీటితో తయారుచేసిన ఈ డిటాక్స్ పానీయం అనుకూలంగా ఉంటుంది.

గమనిక: దాల్చిన చెక్క కొద్దిగా ఘాటుగా ఉంటుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ లేదా అల్సర్ సమస్యలతో బాధపడేవారు దీనిని తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అల్సర్ తీవ్రతను బట్టి, వారు దీనిని తక్కువ మోతాదులో లేదా అప్పుడప్పుడు (రెండు, మూడు రోజులకు ఒకసారి) తీసుకోవాలి. అల్సర్స్ తీవ్రంగా ఉన్నవారు ఈ పానీయాన్ని పూర్తిగా నివారించడం మంచిది. ఏదేమైనా.. ఏదైనా కొత్త ఆహార పదార్థాన్ని డైట్‌లో చేర్చుకునే ముందు వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది..



## ఈ కాంబినేషన్ డేంజర్ గురూ..

చికెన్.. అంటే చాలు నాన్‌వెజ్ ప్రియులు లొట్టలేసుకుంటూ మరి లాగించేస్తారు. చికెన్‌ను కూరగా.. ఫ్రైగా.. ఇంకా మరెన్నో రకాలుగా వండుకుని ఇష్టంగా తింటారు.. ఆదివారం చాలా మంది నాన్ వెజ్ తినే వారుంటారు.. ముఖ్యంగా ఆధునిక జీవనశైలిలో వారానికి ఒకటి రెండు సార్లు కాకుండా నిత్యం చికెన్ తినడం అలవాటు చేసుకుంటున్నారు. అయితే.. ప్రోటీన్ పుష్కలంగా ఉండే చికెన్.. తినడం మంచిదే.. కానీ, చికెన్ తిన్న తర్వాత కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీర్ణక్రియ సులభంగా జరగడానికి కొన్ని సూచనలను పాటించడం మంచిదని పేర్కొంటున్నారు.. చికెన్ తిన్న తర్వాత ఎలాంటి పదార్థాలు తినకూడదో తెలుసుకోండి.

చికెన్ తో పాటు పాలు, పాల ఉత్పత్తులను తీసుకోకూడదు. చికెన్ లో ప్రోటీన్ అధికంగా ఉండగా, పాలలో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఈ రెండింటి కలయిక జీర్ణవ్యవస్థపై ఒత్తిడిని కలిగిస్తుందని, గ్యాస్, ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలకు దారితీస్తుందని ఇండియన్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ 2022 నివేదిక పేర్కొంది.

అలాగే, చికెన్ తిన్న వెంటనే స్వీట్లు, చక్కెర పదార్థాలు లేదా జ్యూసులు వంటి వాటికి దూరంగా ఉండాలి. అధిక చక్కెర పదార్థాలు రక్తంలో గ్లూకోస్ స్థాయిలను అస్థిరం చేసి త్వరగా అలసటకు కారణమవుతాయి. నిమ్మకాయ, నారింజ వంటి ఆమ్ల వంటి వాటిని కూడా చికెన్ తో కలిపి తినడం మంచిది కాదు. ఇవి పొట్టలోని ద్రవాలతో కలిసి ఎసిడిటీని పెంచుతాయి.

## భారత్ ఓపెనింగ్ దరిద్రం.

సౌతాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఎదురైన ఘోర పరాజయం టీమిండియా పరువును బజారున పడేసింది. ఈ ఓటమి తర్వాత సోషల్ మీడియాలో నెటిజన్లు భారత జట్టును ఒక ఆట ఆడుకుంటున్నారు. సెమీఫైనల్ వెళ్లడం ఇప్పుడు భారత్‌కు ఒక హిమాలయ పర్వతాన్ని ఎక్కినంత కష్టంగా మారింది. మిగిలిన రెండు మ్యాచ్‌లలో గెలవడంతో పాటు, పాతాళానికి పడిపోయిన రన్ రేట్‌ను కూడా సరిచేసుకోవాలి. అయితే ఈ దారుణ పరిస్థితులకు ప్రధాన కారణం మన ఓపెనర్లు అని గణాంకాలు చెబుతున్నాయి. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ జోడీ ఈ వరల్డ్ కప్‌లో భారత్‌కు అతిపెద్ద భారంగా మారింది.ఈ టీ20 వరల్డ్ కప్ 2026లో పాల్గొన్న మొత్తం 20 జట్లలో టీమిండియా ఓపెనింగ్ జోడీనే అత్యంత చెత్త ప్రదర్శన చేసింది. ఓపెనింగ్ భాగస్వామ్యంలో భారత్ సగటు కేవలం 6.8 పరుగులు మాత్రమే. మనకంటే చిన్న జట్లైన ఒమన్ (సగటు 10 పరుగులు), ఐర్లాండ్, యూఏఈ, అమెరికా జట్ల ఓపెనర్లు కూడా మనకంటే మెరుగ్గా రాణించడం సిగ్గుచేటు. ప్రపంచంలోనే అత్యంత ధనిక బోర్డు, అత్యుత్తమ బ్యాటర్లు ఉన్న జట్టుకు ఇలాంటి రికార్డు రావడం నిజంగానే అభిమానుల గుండెను రగిలిస్తోంది.మరోవైపు న్యూజిలాండ్ ఓపెనింగ్ జోడీ ఈ టోర్నీలో సూపర్ హిట్?గా నిలిచింది. వారి ఓపెనర్లు సగటున 84 పరుగులు జోడిస్తూ అగ్రస్థానంలో ఉన్నారు. చివరికి మన తర్వాతి ప్రత్యర్థి జింబాబ్వే ఓపెనర్లు కూడా సగటున 53.33 పరుగులు సాధించి భారత్‌కు హెచ్చరికలు పంపిస్తున్నారు. ఇషాన్ కిషన్ ఒక్క మ్యాచ్‌లో కూడా శుభారంభం ఇవ్వలేకపోగా, అభిషేక్ శర్మ ఫామ్ లేమితో కొట్టుమిట్టాడుతున్నాడు. బంతిని బాదడమే లక్ష్యంగా క్రీజులోకి వస్తున్న ఈ ఇద్దరు, కనీసం పవర్ ప్లే కూడా పూర్తి చేయకుండానే పెవిలియన్ చేరుతున్నారు.ఈ నేపథ్యంలో టీమిండియా ఓపెనింగ్ జోడీని మార్చాల్సిన సమయం ఆసన్నమైందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫామ్ లేని అభిషేక్ శర్మను పక్కన పెట్టి, సంజూ శామ్సన్‌ను ఓపెనర్‌గా పంపాలని ఫ్యాన్స్ కోరుతున్నారు. జట్టు అసిస్టెంట్ కోచ్ కూడా రాబోయే మ్యాచ్‌లకు ముందు సంజూ పేరును పరిశీలిస్తామని హింట్ ఇచ్చారు. మరి జింబాబ్వే, వెస్టిండీస్ వంటి కీలక మ్యాచ్‌లలోనైనా ఓపెనర్లు కళ్ళు తెరుస్తారా? లేక పాత పద్ధతిలోనే చేతులెత్తేస్తారా? అనేది తేలాల్సి ఉంది.



## భారత్ సెమీస్ చేరాలంటే..

ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ 2026 సూపర్ 8 పోరులో టీమిండియా దారుణ ఓటమిని మూటగట్టుకుంది. పోటాపోటీగా సాగుతుందనుకున్న మ్యాచ్‌లో సౌతాఫ్రికా చేతిలో భారత్ ఘోర ఓటమిపాలయింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 187 పరుగులు చేస్తే.. 111 పరుగులకే ఆలౌటైన భారత్.. 76 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. దాంతో ఇప్పుడు భారత్ సెమీస్ చేరుకోవడానికి సౌతాఫ్రికా మీదే ఆధారపడాల్సి రానుంది.

ఈ మ్యాచ్‌లో భారత్ ఆలౌట్ కాకుండా ఉన్నా, లేకపోతే తక్కువ మార్జిన్‌తో ఓడిపోయినా ఇంత టెన్షన్ ఉండేది కాదు. 76 పరుగుల తేడాతో ఓడిపోవడం, ఆలౌట్ కావడం, 20 ఓవర్లు ఆడకపోవడంతో భారత్ నెట్ రన్‌రేట్ దారుణంగా పడిపోయింది. సూపర్ 8లో భారత్ రన్‌రేట్‌ను ఒకసారి పరిశీలిస్తే - 3.80కి పడిపోయింది.

సౌతాఫ్రికా భారీ విజయం సాధించడంతో రెండు పాయింట్లతో 3.8 నెట్‌రన్‌రేట్ సొంతం చేసుకుంది. ఈ విజయంతో సౌతాఫ్రికా సెమీస్‌కి దాదాపు లైన్ క్లియర్ అయిందనే చెప్పొచ్చు. జింబాబ్వే, వెస్టిండీస్‌లతో ఒక్క మ్యాచ్ గెలిచినా సౌతాఫ్రికా సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోవచ్చు. అయితే భారత్ కూడా సెమీఫైనల్‌కి వెళ్లాలంటే సౌతాఫ్రికా కచ్చితంగా జింబాబ్వే, వెస్టిండీస్‌పై గెలవాలి. అప్పుడు సౌతాఫ్రికా 6 పాయింట్లు సాధించగలదు. అదే సమయంలో భారత్ మిగతా రెండు మ్యాచ్‌లలో గెలిస్తే 4 పాయింట్లు సాధిస్తుంది. అప్పుడు సౌతాఫ్రికాతోపాటు ఇండియా కూడా సెమీస్‌లో అడుగుపెడుతుంది. సూర్య సేనసౌతాఫ్రికాతో మ్యాచ్‌లో ఓటమికి గల కారణాలను సరిగా విశ్లేషించుకోవాలి.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com